చేస్తున్నారు కానీ తర్వాత వారు మిమ్మల్ని వెతుకుతారు. లేక సదా మీరే వెతుకుతూ ఉంటారా?

శ్రేష్ట ఆత్మలైన మీ కార్యంలో విజ్ఞానం కూడా సహయోగి అవుతుంది. కొద్దిగా అలజడి జరగనివ్వండి మరియు మిమ్మల్ని మీరు అచంచలంగా తయారుచేస్కోండి అప్పుడు చూడండి – మీరు ఆత్మిక అయస్కాంతంగా అయ్యి అనేక ఆత్మలను ఏవిధంగా సహజంగా ఆకర్షిస్తారో! ఎందుకంటే రోజురోజుకి ఆత్మలు నిర్బలంగా అయిపోతారు, తమ పురుషార్థం అనే పాదం ద్వారా నడిచే యోగ్యంగా కూడా ఉండరు. అటువంటి నిర్బల ఆత్మలకు, శక్తిస్వరూప ఆత్మలైన మీ యొక్క శక్తి అనే పాదం ఇచ్చి నడిపిస్తారు. అంటే బాబావైపు ఆకర్షితం చేస్తారు.

అనేక ఆత్మలను దు:ఖం, అశాంతి యొక్క స్మృతి నుండి ఎగిరింపజేసి గమ్యానికి చేర్చాలి, సదా అటువంటి ఎగిరేకళ యొక్క అనుభవిగా అవ్వండి. మీ రెక్కలతో ఎగరవలసి ఉంటుంది. మొదట స్వయం సమర్థ స్వరూపంగా అవ్వాలి అప్పుడు సత్యమైన తీర్థంగా అయ్యి అనేక ఆత్మలను పావనంగా చేసి, ముక్తి అంటే స్వీట్‌హోమ్ యొక్క ప్రాప్తిని ఇవ్వగలరు. మీరు ఈ విధమైన ఆధారమూర్తులు.

ఈరోజు బాప్‌దాదా ఇటువంటి ఆధారమూర్తి పిల్లలను చూస్తున్నారు. ఒకవేళ ఆధారమే చలిస్తూ ఉంటే ఇతరులకు ఎలా ఆధారంగా కాగలరు? **అందువలన మీరు అచంచలంగా అయితే విశ్వంలో అలజడి ప్రారంభం అవుతుంది.** మరియు కొద్దిగా అలజడి జరిగినా అనేక ఆత్మలను సహజంగా బాబా వైపు ఆకర్షితం అవుతారు. ఒకవైపు కుంభకర్ణులు మేల్కొంటారు, రెండవవైపు కొంతమంది ఆత్మలు ఎవరైతే సంబంధ, సంప్రదింపుల్లోకి వచ్చారు కానీ ఇప్పుడు సోమరితనం యొక్క నిద్రలో ఉన్నారో వారు కూడా మేల్కొంటారు. కానీ మేల్కొల్పే వారు ఎవరు? అచంచలమూర్తి ఆత్మలైన మీరే కదా! అర్థమైందా! సేవ యొక్క రూపం ఈవిధంగా మారనున్నది దీని కొరకు శివశక్తి స్వరూపంగా అవ్వాలి. మంచిది –

ఈవిధంగా సదా శాంతి మరియు శక్తి స్వరూప ఆత్మలకు, తమ యొక్క సమర్థస్థితి ద్వారా అనేకులకి స్మృతి ఇప్పించేవారికి, భయాన్ని సమాప్తి చేసి ధ్యాన ఇప్పించేవారికి, ఈవిధమైన ఆధారమూర్తి విశ్వపరివర్తకులు అయిన పిల్లలకు బాప్‌దాదా యొక్క ప్రియస్మృతులు మరియు నమస్తే.

## కర్మేంద్రియాజీత్‌లే విశ్వరాజ్యాధికారులు.....14-1-82

రాజఋషి ఆత్మలతో బాప్‌దాదా మాట్లాడుతున్నారు–

ధ్వనిలోకి రావడానికి లేదా ధ్వని వినడానికి ఎన్ని సాధనాలను ఉపయోగిస్తున్నారు? ధ్వనిలోకి వచ్చేటందుకు బాప్‌దాదా కూడా శరీరం అనే సాధనాన్ని ఉపయోగించవలసి వస్తుంది. కానీ, ధ్వనికి అతీతంగా వెళ్ళేటందుకు ఈ సాధనాల యొక్క ప్రపంచానికి అతీతంగా వెళ్ళవలసి ఉంటుంది. సాధనాలు ఈ ప్రపంచంలోనే ఉంటాయి. బాప్‌దాదాల సూక్ష్మవతనం లేదా మూల వతనంలో ఏ సాధనాల యొక్క అవసరం ఉండదు. సేవార్థం ధ్వనిలోకి రావడానికి ఎన్ని సాధనాలను ఉపయోగిస్తున్నారు? కానీ ధ్వనికి అతీతమైన స్థితిలో స్థితులయ్యే అభ్యాసం ఉన్నవారు సెకనులో వీటన్నింటి నుండి అతీతం అయిపోతారు.



Created by Universal Document Converter

అటువంటి అభ్యాసిగా అయ్యారా? ఇప్పుడిప్పుడే ధ్వనిలోకి రావాలి, ఇప్పుడిప్పుడే ధ్వనికి అతీతంగా అయిపోవాలి. ఇటువంటి కంట్రోలింగ్ పవర్, రూలింగ్ పవర్ మీలో అనుభవం చేసుకుంటున్నారా? ఎప్పుడు కావాలంటే అప్పుడు సంకల్పం చేయాలి, విస్తారంలోకి రావాలి, తిరిగి ఎప్పుడు కావాలంటే అప్పుడు విస్తారాన్ని బిందువులోకి ఇముడ్చుకోవాలి. స్టార్ట్ చేసే (ప్రారంభించే) మరియు స్టాప్ చేసే (నిలిపివేసే) రెండు శక్తులు సమానంగా ఉన్నాయా?

కర్మేంద్రియాల యొక్క ఓ రాజ్యాధికారులూ! మీ యొక్క రాజ్యశక్తిని అనుభవం చేసుకుంటున్నారా? రాజ్యశక్తి శ్రేష్ఠంగా ఉందా లేక కర్మేంద్రియాలు అనే ప్రజాశక్తి శ్రేష్ఠంగా ఉందా? ప్రజాపతి అయ్యారా? ఏమి అనుభవం చేసుకుంటున్నారు? స్టాప్ అనగానే స్టాప్ అయిపోతున్నాయా? మీరు స్టాప్ అంటే, అవి స్టార్ట్ అవ్వటం లేదు కదా! ప్రతీ కర్మేంద్రియం అనే శక్తిని కేవలం మీ కనుసైగల ద్వారా ఎలా కావాలంటే అలా నడిపించాలి. ఇలా కర్మేంద్రియాజీత్‌గా అయ్యి తిరిగి ప్రకృతీజీత్‌గా అయ్యి కర్మాతీతస్థితి యొక్క ఆసనధారి నుండి విశ్వరాజ్యాధికారిగా అవ్వండి. మిమ్మల్ని మీరు అడగండి – మొదట కర్మేంద్రియాజీత్‌గా అయ్యానా? ప్రతీ కర్మేంద్రియం – చిత్తం!... చిత్తం!... అంటూ నడుస్తున్నాయా? రాజ్యాధికారులైన మీకు సదా స్వాగతం చెప్తున్నాయా? నమస్కారం చేస్తున్నాయా? రాజుకి ప్రజలందరూ తలవంచి నమస్కారం చేస్తారు కదా!

ఓ రాజ్యాధికారులూ! మీ అందరి రాజ్య వ్యవహారం ఏవిధంగా ఉంది? మంత్రి లేదా ఉపమంత్రి ఒక్కొక్కసారి మోసగించటం లేదు కదా? మీ రాజ్య వ్యవహారాన్ని పరిశీలించు కుంటున్నారా? రాజ్యసభ రోజూ పెట్టుకుంటున్నారా లేక అప్పుడప్పుడు పెట్టుకుంటున్నారా? ఏం చేస్తున్నారు? ఇక్కడి రాజ్యాధికారం యొక్క సంస్కారం భవిష్యత్తులో ఉపయోగపడుతుంది. వర్తమాన సమయంలో ఆత్మనైన నాలో రాజవంశం యొక్క సంస్కారాలు ఉన్నాయా అని పరిశీలించు కుంటున్నారా లేక ప్రజా సంస్కారం ఉందా లేక దేశ రాజ్యాధికారి అయ్యే సంస్కారం ఉందా? అంటే హద్దులోని రాజ్యాధికారం యొక్క సంస్కారం ఉందా? లేక బేహద్ విశ్వరాజ్యాధికారం యొక్క సంస్కారం ఉందా? లేక అన్నింటికంటే చివరి పదవి దాసదాసీల యొక్క సంస్కారం ఉందా? సాకారంగా కూడా చెప్పేవారు – దాసదాసీల యొక్క సంస్కారం ఏవిధంగా ఉంటుందో? వారు ఏదో ఒక సమస్యకి లేదా సంస్కారానికి ఆధీనం అయ్యి ఉదాశీనంగా ఉంటారు. దాసదాసీలుగా అయ్యే వారి గుర్తు – ఉదాశీనంగా ఉండటం. అయితే నేనెవరు? అని మీకు మీరే పరిశీలించుకోండి. ఎక్కడైనా, ఎప్పుడైనా ఉదాశీనత యొక్క అల రావటం లేదు కదా! ఉదాశీనంగా ఉంటే అలాంటి వారిని రాజ్యాధికారి అని ఎలా అంటారు?

ఇదేవిధంగా షాహుకారులైన (ధనవంతులు) ప్రజలు కూడా ఉంటారు. ఇక్కడ కూడా కొందరు రాజులుగా అవ్వరు, కానీ షాహుకారులు అవుతారు. ఎందుకంటే జ్ఞానరత్నాల యొక్క ఖజానా చాలా ఉంటుంది. సేవ చేసి చాలా పుణ్యఖాతాను జమ చేసుకుంటారు. కానీ, సమయానుసారంగా స్వయానికి అధికారిగా అయ్యి సఫలతా మూర్తులుగా అయ్యే కంట్రోలింగ్ పవర్ లేదా రూలింగ్ పవర్ ఉండదు. అంటే జ్ఞానసాగరులే కానీ శక్తిశాలి కాదు. శస్త్రధారులే కానీ సమయానుసారంగా కార్యంలో ఉపయోగించలేరు. స్టాకు ఉంటుంది కానీ సమయానుసారం స్వయం కొరకు ఉపయోగించలేరు మరియు ఇతరుల ద్వారా కూడా చేయించలేరు. విధానం వస్తుంది కానీ విధి రాదు. ఇటువంటి సంస్కారం కల్గిన ఆత్మలు షాహుకారులు. వీరు


Created by Universal Document Converter

రాజ్యాధికారులకి సదా సమీప తోడుగా తప్పక ఉంటారు. కానీ స్వయం అధికారిగా కాలేరు. అర్థమైందా! ఇప్పుడు మీరు ఆలోచించుకోండి - ఇంతవరకు నేను ఏవిధంగా అయ్యాను అని. ఇప్పుడు కూడా పరివర్తన అవ్వవచ్చు. అంతిమ సీట్ నిర్ణయం అయ్యి అనే ఈల ఇప్పుడు ఇంకా మ్రోగలేదు. పూర్తి అవకాశం ఉంది. మీరు ఇతరులకి కూడా ఏమి చెప్తారు? ఇప్పుడు లేకున్న మరెప్పుడూ లేదు. ఎందుకంటే ముందుగా కొద్ది సమయం యొక్క సంస్కారం కావాలి. అంతిమ సమయంలో కాదు. అందువలన డబల్ విదేశీ గ్రూప్‌కి స్వర్ణిమ అవకాశాన్ని పొందే అదృష్టవంతమైన గ్రూప్‌గా అవ్వండి. అందరూ ఏ గ్రూప్? మంచిది!

కర్మేంద్రియాజీత్, ప్రకృతిజీత్, సూక్ష్మ సంస్కారజీత్ అంటే మాయాజీత్‌లకు, రాజ్యాధికారుల నుండి విశ్వరాజ్యాధికారిగా అయ్యే రాజవంశీ, రాజఋషి ఆత్మలకు బాప్‌దాదా యొక్క ప్రియస్మృతులు మరియు నమస్తే.

## జనవరి 18 అనగా బాధ్యతా కిరీటధారణ మహోత్సవ రోజు ......18-1-82

అవ్యక్త బాప్‌దాదా తనకంటి రత్నాలైన పిల్లలతో మాట్లాడుతున్నారు:-

విశ్వానికి వెలుగు అయిన బాప్‌దాదా తన యొక్క కంటిరత్నాలను కలుసుకునేటందుకు వచ్చారు. గారాభమైన బాబా యొక్క కంటిరత్నాలు, ఏ విధంగానైతే శరీరంలో నయనాలు లేకపోతే ప్రపంచమే లేదు, అదే విధంగా ఆత్మిక వెలుగైన మీరు లేకపోతే విశ్వంలో వెలుగు లేనేలేదు. అంధకారం ఉంటుంది. బాప్‌దాదా యొక్క కంటి వెలుగులు అంటే విశ్వానికి జ్యోతులు. స్మృతి దినోత్సవం అయిన ఈరోజు అమృతవేళ నుండి అందరి యొక్క స్నేహ గీతాలు వతనంలో వినిపిస్తున్నాయి. ప్రతీ ఒక్కరిగీతం ఒకరికంటే ఒకరిది ప్రియంగా ఉంది.

మధురాతి మధురమైన ఆత్మిక సంభాషణలు కూడా చాలా విన్నారు. పిల్లల ప్రేమ యొక్క ముత్యాల మాలల బాప్‌దాదా యొక్క కంఠాన్ని అలంకరించాయి. ఇటువంటి ముత్యాల మాలలు కల్పం మొత్తంలో ఇప్పుడే అలంకరిస్తాయి. అమూల్య స్నేహం యొక్క ముత్యాల మాలలు ఇంకెప్పుడు అలంకరించవు. ఒక్కొక్క ముత్యంలో ఏమేమి దాగి ఉన్నాయో? నా బాబా!... ఓహో బాబా! ..... ప్రతి ముత్యంలో ఈ మాటలే దాగి ఉన్నాయి. ఇలా ఎన్ని మాలలు ఉండి ఉంటాయో చెప్పండి? ఈ మాలలతో బాప్‌దాదా ఎంతగా అలౌకికంగా అలంకరించబడి ఉంటారో కదా! స్థూలంగా కూడా స్నేహానికి గుర్తుగా మాలలతో అలంకరిస్తారు కదా! అలాగే ఇక్కడ స్థూల అలంకరణ చేశారు కానీ వతనంలో అమృతవేళ నుండి బాప్‌దాదాని అలంకరించటం మొదలు పెట్టారు. ఒకదానిపై ఒకటి ఇలా మాలలు బాప్‌దాదాని సుందరంగా అలంకరించాయి. ఇప్పుడు అందరూ ఆ చిత్రాన్ని చూస్తున్నారు కదా!

ఈరోజు విశేషంగా పిల్లలందరి యొక్క కిరీటధారణ మహోత్సవ రోజు. ఈరోజు ఆదిదేవుడు అయిన బ్రహ్మాబాబా స్వయం సాకార బాధ్యతలను అంటే సాకార రూపం ద్వారా సేవ అనే


Created by Universal Document Converter